"సీతమ్మ వాకిటా సిరిమల్లె చెట్టు. కొమ్మ వంచకుండ పూలు కోయండి" అన్నారు ప్రబుద్ధులు. సోషలిజం సీతమ్మ వాకిట వున్న సిరిమల్లె చెట్టు. మరి ఆపూలు ఎవరుకోస్తారో - ఆ దండ ఎవరు గుచ్చుతారో - అది పట్టికెళ్ళి సీతమ్మకిస్తే, రాముడి మెళ్ళో వేస్తుంది. రాముడు రడీగానే వున్నాడు. సీతమ్మ కూర్చుని ఎదురు చూస్తోంది. కొమ్మ వంచకుండా పూలుకోసి దండ కట్టేవారేరి?

# గంతుల మేస్టారు

ఈ రోజుల్లో మగాళ్ళ నందర్నీ మీది టెక్నికల్ సైడా మామూలా అని అడగడం కద్దు, యమ్మెస్సీ చదుకున్న గుంటనైనా "అమ్మాయీ నీ కెందరే పిల్లలు" అనడుగుతారు. కాని నీది టెక్నికల్ సైడా అని అడగరడగరు. మగాడ్ని చూడగానే వీడెంత డబ్బు సంపాదిస్తాడూ (సంపాదించగలడూ) అనే చూస్తారు. కాని మరోటి మరోటీ (అందగాడా పేరు శేఖరా రాజశేఖరా అని) చూడరు. పడుచు పిల్లను చూడగానే మెళ్ళో పుస్తెలు మిల మిల లాడగానే యిది ఎంత మంది పిల్లల్ని కంటుందీ కనగలదూ, కన్నదీ తెలుసుకోవాలని తహ తహలాడి గేదెనుకాని ఆవునుకాని చూడగానే యిది ఎన్ని పాలిస్తుందీ ఎన్ని యీతలు యీనిందీ అని భోగట్టాలు చేస్తారు.

కొబ్బరిచెట్టును కాని, మరేదైనా పళ్ళ చెట్టునుగాని చూడగానే కాపు ఎంత అని అడుగుతారు అలాగే కాఫీ హోటల్ను చూడగానే యిక్కడ ఇడ్లీసైజు ఎంత వుంటుంది, కాఫీ బాగుంటుందా అనే సందేహం వస్తుంది. ఈ లోకంలో ఒక మనిషికాని వస్తువుకాని మనకు ఎంత వరకు ఉపయోగిస్తుందీ? మనకు లాభమా నష్టమా అనే యోచిస్తారుకాని మిగతా సంగతులన్నీ అన్నెససరీ.

కాని యిప్పుడిప్పుడే మన గృహ రాజ్యసీమలో కొత్త మార్పులు వస్తున్నాయి. టెక్నికల్, నాన్ టెక్నికల్ అని వంటింట్లోంచి కూడా వినిపిస్తోంది. గృహ టెక్నిక్స్‌ని అక్షరాలా అమలుపరచేది ఆడది కాబట్టి అటువంటి గృహరాక్షసిని, 'హోమో టెక్నికల్' అనొచ్చు (అలా వీల్లేని పక్షంలో టెక్నికాళి: టెక్నికల్‌రూపం ధరించిన ఆడకాళి అన్నా బైనోమీన్స్ ఫరవాలేదు) ఎవరెన్ని చెప్పినా మన వంటింటి సామ్రాజ్యంలో మగాడు కేతిగాడున్నూ ఆడది బంగారక్కాను. సారాచెంబు తాడులాగేది యిక్కడ మగాడు తలపూపేది పెళ్ళాం అనేటువంటి దినుసు (ఇంకా మీ కర్థంకాలేదా. అయితే మీదికూడా మా వారిదిలానే మట్టి బుర్ర. యాష్ట్రే అనగా దుమ్ము తట్ట దాన్ని దులిపితే మరేవీరాలదు.) నేను చాలా టెక్నికల్‌గా నడుస్తున్నట్లున్నాను. ఏవీ లేదండీ... యథా రాజా తథాప్రజా అన్నట్లు యథా మొగుడు తథాభార్యా అన్నారుకదా. చిన్న యగ్జాంపుల్.... మొగాడు ఇంజన్ డ్రయిరయితే వాడి ఆడది వాడిలో సగం కనుక (అర్ధాంగి) అది కూడా

సగం ద్రయివరయి తీరుతుంది. భర్త ఇంజనీరయితే భార్య హాఫ్‌యాన్ ఇంజనీర్, మరియు భర్తగాడు ఏదైతే అందులో భార్య ఫిఫ్టీ...ఫిఫ్టీ కావాలిగదా. అదే అవుతోంది. అమ్మతల్లి చల్లగా తీయగా అనగా చాలా మంది సోసో లేడీస్ మగాళ్ళకి అచ్చోసిన డూప్లికేట్లు. అందుకే ఏ గూటి చిలక ఆ గూటి పలుకు పలికినట్లు ఏ మగాడి వైఫ్ ఆ మగాడి లైఫ్ గురించి టాకింది టాకకుండా టాకుతుంది. పందిరి మంచం గురించీ, పవ్వళింపు సేవల గురించీ, పట్టు చీరల గురించీ చెప్పుకున్నట్లే తమ తమ భర్తల గురించి పతిభక్తి రంజకంగా చెప్పింది చెప్పకుండా చెప్పుకుపోగ్రలు సోమెనీ లేడీస్. పూర్వం ఇళ్ళన్నీ కులం వాసన కొట్టేవి. ఇప్పుడూ కులం వాసన కొట్టినా వృత్తి వాసనే ఎక్కువ మన కొంపల్లో... ఇంజనీరుగారి పిల్లలకు కంట్రాక్టరూ, బ్రిడ్జిలూ, ఎర్త్ వర్క్సూ, సిమెంట్ కాంక్రీటింగ్, ఎస్టిమేట్లూ, ఫైనలు బిల్లులూ, పరసంటేజీలూ కరతలామలకం కదా. అదే పరిభాష వారింట్లో మార్మోగుతూ వుంటుంది. బైదిబై మాస్టరిళ్ళలో మార్కులు, పరీక్షలు, పుస్తకాలు, నోట్సులూ, సెలవల టాపిక్కులే చెల్లుబడి అవుతూ వుంటాయి. జర్నలిస్టు పెళ్ళానికి డబల్‌కాలం హెడ్డింగులూ, సింగిల్ కాలాలూ, హాఫ్‌టోన్, లైన్ బ్లాకులూ, కటవుట్, ట్వెల్వుపాయింట్, రన్నింగ్ మేటర్, పేజెస్ అంటే బాగా తెలుస్తాయి. రైల్వే వాళ్ల పిల్లలకి అప్ ట్రెయినులూ, డవున్ ట్రెయిన్లూ, స్టేషన్‌కోడ్సూ, డ్యూటీ అవర్సూ, జీరో అవరూ, ఫస్ట్‌నైట్, సెకండ్‌నైట్ అంటే ఆ భాష వారికే తప్ప తదితరులకు సులువుగా అర్థమయిచావదు.

ఏం లేదు మన జీవితం క్రమేపీ చాలా టెక్నికల్ అయిపోతోంది. ఈ వాతావరణానికి అకస్మాత్తుగా అడ్జస్టు అయిపోవాల్సిన అవసరం ఆడదానికి పట్టింది. డాక్టరు పెళ్ళానికి రోగాల గురించీ మందుల గురించీ వాటి చికిత్స, గురించీ తెలిసినట్టు మరోళ్ళకీ మరోళ్ళకీ ఎలా తెలుస్తుంది? తెలీత్తెలీదు. ఇలాటి సరుకంతా ఒక ప్లాట్‌ఫారం మీదకు చేరితే అది ఒక అపూర్వ ప్రహసనం మాదిరి నవ్వు పుట్టిస్తుంది.

ఆడాళ్ళ ప్రపంచం వేరు, ఆడవాళ్ళ ప్రపంచం వేరని అంటారు కాని ఆ ప్రపంచంలో కూడా వాళ్ళు పాపం హర్‌మాస్టర్స్ వాయిస్సే అయ్యో పిల్లాడు టిఫిన్ తినకుండా వెళ్ళాడే, ఆయన అన్నానికి రాలేదే అని పెళ్ళాం అనుకుని బాధపడిపోతుంది.

కాని పెళ్ళాం అన్నంతిందా లేదా అని ఏ మగాడూ అడగడు. వంటింట్లో కూర్చుని తింటుంది. తినకేంచేస్తుందనే దృక్పథంతోటే వుంటాడు. అది రైటవనివ్వండి రాంగవనివ్వండి అదంతే. (ఆ దర్జాకే ఆడది దాసోహమంటుంది.)

మా దొడ్డి గుమ్మంవైపు బాదంచెట్టు పక్క వాటాలో గంతుల మేష్టారని వుండేవారు. ఆయన చేసేది మాస్టరీ వుద్యోగమైనా తెల్లారి లేచింది మొదలు అన్నిటికీ కేకలూ గంతులే. అతడలా నిప్పుతొక్కిన కోతిలా ఎగుర్తుంటాడా ఆ మహా ఇల్లాలు మాత్రం తొణక్కుండా బెణక్కుండా చిరునవ్వులు నవ్వుతూ నిమ్మకు నీరెత్తినట్లుండేది. పైగా ఎవరైనా స్టూడెంట్స్ వస్తే వారితో బాతాఖానీలు వేస్తూ మీ గంతుల మేష్టారేవంటున్నారనేది. ఆ విధంగా ఆ చిరునామధేయం స్కూల్లో వ్యాపించే సరికి దాని పుట్టుపూర్వోత్తరాలు తవ్విన వారికి మేష్టారి మిస్ట్రెస్సే ఆ పేరు

పెట్టిందని తేట తెల్లమయింది. తెల్లారి లేస్తూనే గంతుల మేష్టారు "నీ మొహం మండా అప్పుడే తెల్లారిందే" అంటూ లేచేవాడు. ఓసి నీ అమ్మ కడుపు మాడా, "నీ మొహం ఈడ్వా" – "నీ తల్లి బొడ్డు పొక్క" – అంటూ యాకరువు పెట్టేవారు. ఇప్పుడు ఇంగ్లీషు భాషా పరిజ్ఞానం అధికమయినందున మన అధునాతనిక్స్ రాస్కెల్, ఇడియట్, యాస్, లిటిల్ స్కవుండ్రల్ అని తిడుతూ వచ్చారు, కాని వైదీకపు తిట్ల ముందర ఇంగ్లీషు తిట్లు వేదమంత్ర ఘోష జరుగుతుండగా ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్‌స్టార్ చదివినట్లుంటుంది.

గంతుల మేష్టారి విషయం ఎందు కొచ్చిందంటే గంతుల మేష్టారి సతీమణిలాగా మన లేడీస్ మగాళ్ళని అట్టే కేర్ చేయకుండా వాళ్ళ ఇన్ అండ్ అవుట్స్ కనిపెట్టి నొక్కవలసిన చోట గట్టిగా నొక్కాలి.

అసలు ఆడాళ్ళు హిజ్ మాస్టర్స్ వాయిస్ ప్లేట్ మీదుండే కుక్కల్లాగా వుండకూడదని చెప్దామని సోది మొదలెట్టాను. మధ్యలో గంతుల మేష్టారొచ్చి మన టాపిక్ చెడగొట్టారు. చెడగొడితే చెడగొట్టారు. కాని గంతుల మేష్టారి పెళ్ళావు లేడీస్‌లోకెల్ల చెప్పుకోతగ్గలేడి. అస్సలావిడే గొప్ప డాంకేరు మాష్టారు. అల్లక్కడ శ్రీకృష్ణుడొచ్చాడు. రథం దిగి అర్జునుడికి గీతోపదేశం చేస్తున్నాట్ట. మనం కూడా విందామా వెళ్ళి పిన్ని గారూ వస్తారా అంటే ఐ డోంట్ కేర్ అంటుంది. సచ్చే లేడితో స్నేహం నిజంగా వండరాఫ్ వండర్స్.... గంతుల మేష్టారి పెళ్ళాం పేరు చెప్పమంటారా...నో...నో...చెప్పను. ఆవిడ ఫ్రండ్‌షిప్ అనగా స్నేహితపువోడను ఐ వాల్యు మోస్ట్ నేను అన్నిటికన్నా మిన్నగా భావిస్తాను.

# మేలుకొలుపులు

మావారిని నిద్రలేపటం చాలా కష్టం. లెట్‌ది స్లీపింగ్ డాగ్స్ లై అని ఇంగ్లీషు వాడన్నాడు. సుప్తభుజంగంలా మౌనమృదంగంలా మావారలా పడుకునుంటేనే ప్రాణానికి రవ్వంత హాయీ సుఖమూను. నిద్రపోతుంటే అంతా దేవుళ్ళలాగే వుంటారు, లేస్తేనే దయ్యాలూ భూతాలూ ఎట్‌సెట్రాల్లా కనిపిస్తారు మనుషులు. పతిదేవుళ్ళకు మంచాల దగ్గర భూపాలరాగాలు పాడితే లాభంలేదు. ట్రాన్సిస్టర్లు మ్రోగిస్తే మెలకువొస్తుంది. ఎవరో సిస్టర్ పాడుతోందికదా అని పాపం ఆశపడి లేస్తారు. నిద్రమంచంమీంచి లేవటమనే సన్నివేశానికి మన కల్చర్‌లో రిలిజన్‌లో ట్రెడిషన్‌లో చాలా యింపార్టెన్సు వుంది. నిద్ర, చీకటి, అజ్ఞానం ఈ మూడు మూడే. వీటిలోంచి ఎవరైనాసరే మేలుకొని పాటలు పాడితే ఆనందంగానే వుంటుంది మరి.

తెలతెల వారుతూంటే యిక పాలవాడికేక వినిపించే ముందు అప్పుడెంత బద్ధకంగా ఉంటుందో లేవటానికి నాట్ సో యీజీ టు రైజ్, అప్పుడు పక్కలోంచి లేచి పనిపాట్లు చేసుకునే